క్లుప్తంగా

పరామర్శ



మాట్లాడుతున్న కోనేరు కోనప్ప

బెజ్జూర్: మండలంలోని అందుగులగూడ గ్రామానికి చెందిన తొర్రెం వెంకటలక్ష్మి అనే విద్యార్థిని శుక్రవారం అనారోగ్యంతో ఆసిఫాబాద్‌లోని బీసీ వసతి గృహంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రూ.20 వేల ఆర్థిక సాయంతో పాటు ఒక క్వింటాలు బియ్యం అందజేశారు. ఆయన వెంట బెజ్జూర్ మండల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ, మాజీ కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రానికి చెందిన వ్యాపారి ముప్ప అంకమ్మరావు కుమారుడు సందీప్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆదివారం ఆయనను సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సతీమణి రమాదేవిలు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్: అక్రమంగా రవాణా చేసేందుకు నిల్వ ఉంచిన తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ఆసిఫాబాద్ మండలం రాజుర గ్రామానికి చెందిన బోయిరే వినోద్ ఇంట్లో ఉన్న బియ్యాన్ని ముందస్తు సమాచారంతో స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం



సన్మానిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదిలాబాద్‌లోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుంగు, ప్రధాన కార్యదర్శి శ్రీరాం అధ్యక్షతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గేడం శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా కుమురం బాజీరావ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్, పరుశురాం, విలాస్, దివాకర్, అశోక్, శ్రీధర్ తదితరులున్నారు.

బాల్యవివాహం చేయవద్దు



మాట్లాడుతున్న పవార్ యశోద

ఆదిలాబాద్‌రూరల్: బాల్య వివాహాలతో జీవితం అక్కడే ముగిసిపోతుందని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పవార్ యశోద అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ దళితాభివృద్ధి శాఖ బాలికల వసతి గృహంలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసం 1098, 100, మహిళల కోసం 181 హెల్ప్ లైన్ నంబర్‌లు, షీటీం సభ్యులు 24 గంటల పాటు పని చేస్తున్నాయన్నారు. ఆడపిల్లల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షూర్ ఎన్జీవో రూపొందించిన బాల్య వివాహ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం కేస్ వర్కర్ నాగమణి, గంగాదేవి, రోహిణీ, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ తోట సుమలత, తదితరులు పాల్గొన్నారు.

స్వెటర్లు పంపిణీ

తలమడుగు: మండలంలోని దేవపూర్ గ్రామంలో ఆదిలాబాద్ చెందిన రామకృష్ణ గౌడ్ దంపతులు ఆదివారం గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువ ఉండడంతో స్వెటర్లు అందించడం జరిగిందన్నారు. మాజీ సర్పంచ్ అబ్దుల్లా, అబ్దుల్లా గణేష్, రాజేశ్వర్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవానికి ఆహ్వానం

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను మండలంలోని కుమారి గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కలిసి గ్రామానికి చెందిన పరమహంస సచ్చిదానంద సద్గురు శ్రీశబరి మాతాజీ ఆశ్రమం వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రం అందజేశారు.

గుడ్డు కనుమరుగు..!

- మధ్యాహ్న భోజనంలో కనిపించని గుడ్డు
- నానాటికీ పెరుగుతున్న ధరలు
- ఆర్థిక ఇబ్బందుల్లో నిర్వాహకులు



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



నిషానిలో వంటలు చేస్తున్న నిర్వాహకులు

కెరమెరి: కోడిగుడ్డుధర ఆకాశాన్ని అంటుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భారంగా మారింది. సోమవారం, బుధవారం, శుక్రవారాల్లో తప్పనిసరిగా విద్యార్థులకు గుడ్డును అందించాలని నిబంధలున్నా పెరుగుతున్న ధరలతో కొన్ని పాఠశాలల్లో గుడ్డు వడ్డించాలనే నిబంధన అమలు కావడం లేదు. ధరలు పెరగుతుండడంతో వారంలో ఒకటి, రెండుసార్లు మాత్రమే ఇస్తున్నారు. దీని వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. దీనికి తోడు నిర్వాహకులకు సకాలంలో బిల్లుల రాకపోవడతో ఇబ్బంది పడుతున్నారు. సర్కారు బడుల్లోని విద్యార్థులకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో గుడ్డు ఇస్తుంది. ఇందుకు ఒక్కో దానికి రూ. 5 చెల్లిస్తుంది. కాని ప్రస్తుతం మార్కెట్లో రూ. 7 ధర పలుకుతుండడంతో నిర్వాహకులకు భారంగా మారింది. మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా.. 81 ప్రభుత్వ పాఠశాలల్లో ఎండీఎం కొనసాగుతోంది. ఇందులో 3875 మంది విద్యార్థులు చదువుతున్నారు.

గుడ్డు ధర పెంచాలి



నానాటికి మార్కెట్లో గుడ్డు ధర పెరగడం వల్ల వారంలో మూడుసార్లు గుడ్డు వండి పెట్టడం కష్టతరంగా మారుతుంది. ప్రభుత్వం మాకిచ్చె గుడ్డు ధరను కనీసం రూ. 7కు పెంచాలి. ప్రతీ నెలనెలా ఎండీఎం బిల్లులు ఇవ్వాలి. – కంబాల లక్ష్మి, ఎండీఎం నిర్వాహకురాలు, కెరమెరి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



గుడ్డు ధర పెరగడంతో వంట నిర్వాహకులకు పడుతున్న భారం గురించి జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రతీ పాఠశాలలో విధిగా వారంలో మూడుసార్లు గుడ్డు అందించాలి. మినహాయింపు లేదు.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

నెలలో 12 సార్లు..

మధ్యాహ్న భోజనంలో వారంలో మూడుసార్లు, నెలలో 12సార్లు గుడ్డు ఇవ్వాలి. కాని ప్రభుత్వం రూ. 5 చెల్లిస్తుండడంతో ఒక్కోక్కరిపై అదనంగా నెలకు ఒక్క గుడ్డుకు రూ. 24 అదనపు భారం పడుతుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారం భరించలేక కొన్ని పాఠశాలల్లో బిస్కెట్లు, ఇతర స్వీట్లు అందిస్తున్నారు. నష్టమైన సరే కొన్ని బడుల్లో పెడుతున్నారు. కొన్ని పాఠశాలలో చేతులెత్తేస్తున్నారు. దీనికి తోడు బిల్లులు చాలా రోజుల నుంచి రావడం లేదని వాపోతున్నారు.

ఆగస్టులో రూ. 5.70..

ఐదు నెలల్లో గడ్డు ధర అమాంతంగా పెరిగింది. గతంలో ఎప్పుడు కూడా ఇంత ధర పెరిగిన సందర్భాలు లేవు. ఆగస్టులో రూ. 5.70 ధర ఉంటే ఇప్పుడు రూ. 7కు చేరింది. కాగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.8, 9కి కూడా విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఉట్నూర్‌రరల్: విద్యుత్‌శాఖ ఉట్నూర్ డివిజన్ పరిధిలో అవినీతికి పాల్పడుతున్న విద్యుత్ శాఖ డీఈ సుభాశ్, ఏఈ రోహిదాస్‌లపై చర్యలు తీసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 2023- 24, 2004- 25కు కోటి 35 లక్షలకు టెండర్లు నిర్వహించి అగ్రిమెంట్లు సైతం చేయడం జరిగిందన్నారు. అట్టి పనులను నలుగురు కాంట్రాక్టర్లకు అగ్రిమెంట్లు చేయడం జరిగిందన్నారు. టెండర్ దారులకు సంబంధం లేకుండా ఇతర ప్రాంతాల వారికి పనులు అప్పగించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి చర్యలు లేవన్నారు. అగ్రిమెంట్ చేసినప్పటికీ పనులు కేటాయించక పోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల సమస్యలను ప్రభుత్వం తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట వారం రోజులుగా సమ్మె చేస్తున్న సీఆర్టీలకు భరోసా కల్పించడానికి సమ్మె శిబిరాన్ని సందర్శించారు. సీఆర్టీలకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉద్యోగాలు కల్పించిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. సమ్మె చేస్తున్న సీఆర్టీలకు టీపీటీఎఫ్ మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

కొనసాగుతున్న సర్వే

ఇచ్చోడ: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఆదివారం ముఖరా(బి)లో చేపడుతున్న సర్వేను ఎంపీవో సత్యానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ యాప్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్వహిస్తున్న సర్వేలో వారి వివరాలను అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇల్లు రానివారు, సొంత స్థలాలు కలిగిన ఉన్న వారి పేర్లను నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం వచ్చిన పంచాయతీ సిబ్బందికి లబ్ధిదారులు తమ వివరాలను తెలియజేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్, అడప్ మారుతి పాల్గొన్నారు.

బోనాల సందడి



శివాలయం వద్ద భక్తుల సందడి

చింతలమానెపల్లి మండలంలోని గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని శివపల్లి శివాలయంలో ఆదివారం షష్టి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక గిరిజనులు భారీ ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అగ్ని గుండాలు, శివసత్తుల ప్రదర్శన ఆకట్టుకుంది. దీంతో అటవీ ప్రాంతంలో పండుగ సందడి నెలకొంది. ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మూడో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించారు.

– కాగజ్‌నగర్ రూరల్/ చింతలమానెపల్లి



బోనాలతో మహిళలు



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

వైభవంగా అయ్యప్ప చక్రస్నానం

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం అయ్యప్ప పల్లకి సేవ, చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. న్యూకాలనీలోని అయ్యప్ప దేవాలయం నుంచి పెద్దవాగు వరకు పల్లకి సేవ చేపట్టారు. పట్టణంలోని పలు వీధుల గుండా పేటతుల్లి ఆడుతూ పెద్దవాగుకు చేరుకున్నారు. పెద్దవాగులో అయ్యప్ప విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



చక్రస్నానం నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

భక్తిశ్రద్ధలతో పల్లకి ఊరేగింపు

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయ 51వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను ఆదివారం ప్రత్యేక పూజలతో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆరాధన, హారతి నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలతో శివాలయం నుంచి పార్వతి పరమేశ్వరుల పల్లకి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం అఖండ దీపారధన, ధ్వజారోహన, మహా గణపతి హోమం, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న భక్తులు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్: యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై రాజేశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆడ గ్రామంలో కళాబృందం ఆధ్వర్యంలో నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైన మోసపోతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటు మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళా బృందసభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బస్సు సౌకర్యం కల్పించరూ?

- అగర్‌గూడ, కొండపల్లికి అందని ఆర్టీసీ సేవలు
- ప్రైవేట్ వాహనాల్లోనే ప్రయాణం



అగర్‌గూడ గ్రామానికి బస్సు ప్రారంభిస్తున్న నాయకులు (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ, కొండపల్లి గ్రామాలకు ప్రభుత్వం గత పదేండ్ల క్రితం పక్కా రోడ్లను నిర్మించినా.. ఆర్టీసీ సేవలు మాత్రం అందడం లేదు. దీంతో ప్రజలు ప్రతీరోజు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి చేరుకోవటానికి ప్రైవేట్ వాహనాల ఆశ్రయిస్తున్నారు. అత్యవసర సమయంలో అధిక ధరను వెచ్చించి ప్రయాణం చేస్తున్నారు.

గత సంవత్సరం..

ఆర్టీసీ అధికారులు గత సంవత్సరం డిసెంబరులో పెంచికల్‌పేట్ నుంచి ఎల్లూర్ మీదుగా అగర్‌గూడ గ్రామానికి బస్సు సర్వీసు ప్రారంభించారు. రెండు రోజులు మాత్రమే సేవలను అందించిన అధికారులు సర్వీసులను నిలిపివేశారు. పెంచికల్‌పేట్ నుంచి కొండపల్లి వరకు బీటీ రహదారి ఉన్న నేటికి గ్రామానికి బస్సు సర్వీసులు ప్రారంభం కాలేదు. దీంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ గమ్యాన్ని చేరుకుంటున్నారు.

ఉచిత బస్సుకు దూరం..

ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు కల్పించిన ఆయా గ్రామాల్లోని మహిళలకు ఉచిత ప్రయాణం లభించడం లేదు. విద్యార్థినులు, మహిళలు 10 కిలోమీటర్లు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకుంటున్నారు.

ఆర్టీసీ సేవలు ప్రారంభించాలి



గ్రామానికి ఆర్టీసీ సేవలు లేనందున ప్రతీ రోజు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం సాగిస్తున్నాం. సమయానికి వాహనాలు లేక అధిక చార్జీలను చెల్లిస్తున్నాం. అధికారులు స్పందించి గ్రామానికి ఆర్టీసీ సేవలు ప్రారంభించాలి.

– చౌదరి భాస్కర్, అగర్‌గూడ

ప్రైవేటు వాహనాలే దిక్కు



గ్రామానికి గతంలో పక్కా రోడ్డు నిర్మించినా.. నేటికి ఆర్టీసీ సేవలు అందడం లేదు. పెంచికల్‌పేట్ నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి కొండపల్లి క్రాస్ వద్ద బస్ దిగుతున్నాము. మరో మూడు కిలోమీటర్లు కాలినడకన గ్రామానికి చేరుకుంటున్నాం.

– ఆత్రం సిద్దు, కొండపల్లి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆదివారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎండీ జహిర్, కొరెంగా సుంక్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, సోన్‌కాంబ్లే జితేందర్, పవార్ దుదిరామ్, రోహిదాస్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన ఎస్.మమతకు మంజూరైన రూ.13,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్ధిదారుడికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, ప్రీతం రెడ్డి, గులాబ్, సురేందర్, లక్ష్మణ్, భూషణ్ పాల్గొన్నారు.

తల్లులకు తోడుగా..



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఆసిఫాబాద్‌రూరల్/కెరమెరి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరింది. ఈ క్రమంలో శిబిరంలో తల్లులతోపాటు కూర్చున్న చిన్నారులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. గణిత దినోత్సవం సందర్భంగా ఉద్యోగులు శ్రీనివాస రామానుజన్‌కు నివాళులర్పించారు. కళాకారులు భజన చేయగా, మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. సోమవారం నుంచి సమ్మె ఉధృతం చేస్తామని సంఘం అధ్యక్షురాలు శృతిక తెలిపారు.



తల్లుల వెంట నిరసనలో చిన్నారులు

దుప్పట్లు పంపిణీ

బెజ్జూర్: ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ జన్మదినం సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, నాయకుడు సామల రాజన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దీంతో పాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగు సురేశ్ గౌడ్, మెరుగు రమేశ్, ఎలుకరి రమేశ్, గుమ్ముల శ్రీనివాస్, శైలేష్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు